సాక్షి
జగిత్యాల

గురువారం । 20 । మార్చి । 2025

I

ఉప్పొంగిన భక్తిభావం

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో ముప్పూరు స్వాముల రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వేలాది మంది భక్తజన సందోహం మధ్య స్వాములకు శోభాయాత్ర చేపట్టారు. రథోత్సవం ముగిసిన అనంతరం ఉత్సవమూర్తులను గోదావరికి తీసుకెళ్లి చక్రస్నానం, ఇతర పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాలకు వచ్చిన వేలాది మంది భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.





	ఇఫ్తార్ గురువారం (సా॥)	సహర్ శుక్రవారం (ఉ॥)
కరీంనగర్ :	6.28	5.06
పెద్దపల్లి :	6.33	4.59
సిరిసిల్ల :	6.28	5.08
జగిత్యాల :	6.33	4.59

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి కల్యాణ మహోత్సవంలో నృత్యం చేస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఆలయ కమిటీ వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు, వాకిటి సత్యంరెడ్డి, రైతు ఐక్యవేదిక నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఇల్లెందుల తుకారాం, సభ్యులు పాల్గొన్నారు.

నిర్వాసితులు అభ్యంతరాలు ఉంటే తెలపండి



కోమటికొండాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్


ఇబ్రహీంపట్నం: సదర్‌మాట్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులు అభ్యంతరాలు ఉంటే తెలపాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కోమటికొండాపూర్ శివారు గోదావరి కుర్రులో భూములు కోల్పోతున్న రైతులతో గ్రామ పంచాయతీ వద్ద సమావేశమయ్యారు. అభ్యంతరాలు తెలపకుంటే నిర్వాసితులకు ఎంత పరిహారం వస్తుందో వారంరోజుల్లో తెలియజేస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని ఎర్దండి శివారు నల్ల గుట్ట వద్ద గల వివాదాస్పద భూములను పరిశీలించారు. సర్వే నంబర్ 104లో 250 మందికి ఒక్కొక్కరికి 180 చదరపు గజాల చొప్పున 1996లో అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్‌రావు పట్టాలు ఇచ్చారు. ఆ స్థలం తమదేనంటూ బర్దీపూర్ గ్రా మానికి చెందిన సునీల్ రెడ్డి అభ్యంతరం తెలుపుతున్నారు. ఆ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో ఎప్పు డు పట్టాలు ఇచ్చారనే వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను త్వరలోనే ప రిష్కరిస్తానని వెల్లడించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, గ్రామ ప్రత్యేక అధికారి రామకృష్ణరాజు, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్, పంచాయతీ కార్యదర్శి సరిత , రైతులు పాల్గొన్నారు.

24న అసెంబ్లీని ముట్టడిస్తాం



మల్లాపూర్‌లో రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న పన్నాల తిరుపతిరెడ్డి

మల్లాపూర్: రైతుల సంక్షేమాన్ని విస్మరించి వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 24న వేలాది రైతులతో అసెంబ్లీని ముట్టడిస్తామని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి తెలిపారు. మల్లాపూర్ మండలకేంద్రంతోపాటు మొగిలిపేట గ్రామాల్లో రైతులను కలిసి మద్దతు కోరారు. ప్రధాన కూడళ్ల వద్ద నిరసన తెలిపి నినాదాలు చేస్తూ రైతాంగ సమస్యల పరిష్కారానికి చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతు ప్రభుత్వమంటూ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. రుణమాఫీ కాని వేలాది మంది రైతులు కలెక్టర్ వద్దకు వెళ్లి విన్నవించుకుందామంటే ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయిస్తోందని విమర్శించారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యలయాల ముందు రైతులు ధర్నా చేస్తున్నా.. ప్రభుత్వంలో చలనం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పసుపు పంటకు మద్దతుధర, రుణమాఫీ, రైతు భరోసా వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా రైతులు ఈనెల 24న అసెంబ్లీ ముట్టడికి తరలిరావాలని కోరారు. కార్యక్రమాల్లో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, మారు మురళీధర్‌రెడ్డి, రైతు ఐక్యవేదిక మండల అధ్యక్షుడు డబ్బా రమేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వనతడుపుల నాగరాజు, భూక్య గోవింద్‌నాయక్, రైతు సంఘం నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, కొమ్ముల జీవన్‌రెడ్డి, కాసారపు భూమారెడ్డి, క్లోం మహిపాల్‌రెడ్డి, న్యావనంది లింబారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బండి లింగస్వామి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, ఎలాల జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రాజెక్టులకు పెద్దపీట

- సంక్షేమం, సాగునీటి రంగానికి నిధులు
- ఎల్లంపల్లి, వరదకాల్వకు కేటాయింపులు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు అత్యధికంగా..
- మానేరు రివర్ ఫ్రంట్‌కు రిక్తహస్తమే
- కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.101 కోట్లు
- 2025-26 బడ్జెట్‌లో కానరాని కొత్త ప్రాజెక్టుల ప్రస్తావన

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్ర బడ్జెట్ 2025–26లో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, వివిధ సాగునీటి ప్రాజెక్టుల పనులకే పెద్దపీట వేసింది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఎలాంటి కొత్త ప్రాజెక్టులు, తాయిలాల ప్రకటనకు ఈసారి ప్రభుత్వం దూరంగా ఉంది. ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, పాత ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులకు పెద్దపీట వేసింది. కాళేశ్వరం, ఎల్లంపల్లి, వరదకాల్వల నిర్వహణకు నిధుల విడుదల చేయడం ఇందుకు నిదర్శనం. అదే సమయంలో పత్తిపాక ప్రాజెక్టుపై ప్రకటన లేకపోవడం, జగిత్యాల మెడికల్ కాలేజీ నిధులు, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీకి మిగిలిన బకాయిల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. శాతవాహన వర్సిటీకి, కరీంనగర్ స్మార్ట్‌సిటీకి నిధులు కేటాయించిన ప్రభుత్వం.. మానేరు రివర్ ఫ్రంట్‌కు నిధులు కేటాయించకపోవడం విశేషం. ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఈ బడ్జెట్‌లో రూ.2,685 కోట్లు ప్రగతిపద్దులో కేటాయించడం చెప్పుకోదగిన అంశం.

కేటాయింపులు ఇలా..

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్‌ఆర్ ఎస్‌పీ) నుంచి మిడ్ మానేరును కలిపే వరద కాల్వకు రూ.299.16 కోట్లు పూర్తి కాని పనుల కోసం వాడనున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు రూ.349.66 కోట్లు స్టేజ్–2లో పూర్తిచేయాల్సిన పనులకు ఈ నిధులను వినియోగించనున్నారు.
- మానేరు ప్రాజెక్టుకు రూ.లక్ష, బొగ్గులవాగు (మంథని): రూ.34 లక్షలు, రామడుగు, గోదావరి బేసిన్: రూ.2.23 కోట్లు, చిన్న కాళేశ్వరం రూ.0, కాళేశ్వరం రూ.2,685 కోట్లు ప్రగతి పద్దు కింద కేటాయించింది. ఈ నిధులను పలుఅభివృద్ధి పనులకు వినియోగించనున్నారు. కానీ.. అంతా ఆశించిన పత్తిపాక ప్రాజెక్టు ప్రస్తావన లేకపోవడం ఉమ్మడి జిల్లా వాసులను నిరాశకు గురిచేసింది.
- శాతవాహన యూనివర్సిటీకి రూ.35 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర క్రీడా విద్యాలయాలైన కరీంనగర్–వరంగల్‌లకు కలిపి రూ.41 కోట్లు ప్రకటించింది.
- అదే సమయంలో కరీంనగర్‌లోని ప్రతిష్ఠాత్మక మానేరు రివర్ ఫ్రంట్ (ఎంఆర్‌ఎఫ్) కోసం ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరగలేదు. మొత్తం రూ.800 కోట్ల అంచనాతో మొదలైన ప్రాజెక్టు వాస్తవానికి ఈఏడాది మేలో పూర్తవాల్సి ఉంది. గత ప్రభుత్వం రెండు విడదలుగా ఒకసారి రూ.310 కోట్లు మరోసారి రూ.234 కోట్లు మొత్తం కలిపి రూ.545 కోట్ల పైచిలుకు నిధులు విడుదల చేసింది. దీనికి టూరిజం వాళ్లు మరో రూ.100 కోట్లు కలపాల్సి ఉంది. కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం, కొత్త కేటాయింపులు లేకపోవడం, సాంకేతిక కారణాల వల్ల ప్రాజెక్టులో జాప్యం నెలకొంది. గతంలో రూ.210 కోట్లు విడుదలవగా, ఇటీవల మరో రూ.130 కోట్ల వరకు విడుదలయ్యాయని తెలిసింది.
- కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు రూ.101 కోట్లు ఇస్తున్నట్లు తెలిపింది. అదే సమయంలో రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లకు సాయం కింద ఏమీ కేటాయించలేదు.
- ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ.12,500 కోట్లు కేటాయించింది. పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారుల చొప్పున ప్రతీ ఒక్కరికీ రూ.5 లక్షల వరకు ప్రభుత్వం సాయం చేయనుంది. ప్రస్తుతం కేటాయింపుల ప్రకారం..చూసినపుడు119 నియోజకవర్గాల్లో ప్రతీ నియోజకవర్గంలో దాదాపు 2100 ఇండ్లకే ఈ సాయం సరిపోతుంది.
- ఇక ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ, ధర్మపురి, కొండగట్టులకు ఎలాంటి ప్రకటన లేకపోవడం భక్తులను నిరాశకు గురిచేసింది.
- కీలకమైన కాకతీయ కాల్వల ఆధునికీకరణ, కల్వల ప్రాజెక్ట్ లకు నిధులు ఇవ్వకపోవడంపైనా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



ఆర్థిక, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

దళితబంధు ఊసేలేదు



ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీనవర్గాలను మోసం చేసేలా ఉంది. అభయహస్తం కింద రూ. 12 లక్షలు ఇస్తామన్నా ఊసే లేదు. దళితబంధు రాంరాం చెప్పారు. ఆరుగ్యారంటీల ప్రస్తావనే లేదు. ప్రజలు నమ్మిఓట్లు వేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కోట్ల మందిని మోసం చేసింది. తులం బంగారం, మహాలక్ష్మి, పెన్షన్ల పెంపు లేదు.

కొప్పుల ఈశ్వర్, మాజీమంత్రి

అంకెల గారడీ బడ్జెట్



బడ్జెట్‌లో మహిళలకు రూ. 2500 పెన్షన్ ఊసే లేదు. కళాశాల విద్యార్థులకు స్కూటీలు లేవు. అన్ని దొంగ మాటలు, కల్లిబొల్లి ప్రకటనలు. రూ.8లక్షల కోట్ల అప్పు అంటూ.. రూ.1.50 లక్షల కోట్ల అప్పు చేసింది ప్రభుత్వం . కల్యాణలక్ష్మి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.5 లక్షలు ఎప్పుడిస్తారో చెప్పాలి.

విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఊరటనివ్వని బడ్జెట్



గతంతో పోల్చితే రూ.13, 806 కోట్ల బడ్జెట్ పెంచినప్పటికీ కార్మికులు, ఉద్యోగులకు ఊరటనివ్వలేదు. కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, సంక్షేమంపై ప్రస్తావన కనిపించలేదు. కార్మిక శాఖకు రూ.900కోట్ల నామమాత్రపు కేటాయింపులు చేశారు. ఉద్యోగుల పెండింగ్ డీఏ బకాయిలు, పీఆర్సీని పట్టించుకోలేదు.

పుప్పాల శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా కన్వీనర్

సంక్షేమం, అభివృద్ధి



బడ్జెట్ అభివృద్ధికి కేరాఫ్‌గా నిలవనుంది. విద్యా, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం శుభ పరిణామం. అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి మండలికి ధన్యవాదాలు.

తాటిపర్తి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

గల్ఫ్ కార్మికులకు మోసం



బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులను మోసం చేశారు. ఎన్నికల కంటే ముందు గల్ఫ్ సంక్షేమానికి నిధులు.. ప్రత్యేక ప్యాకేజీ కేటాయిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన ప్రభుత్వం నేడు బడ్జెట్‌లో ఆ ఊసే లేదు.

రాదారపు సతీశ్, ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్‌సెల్ అధ్యక్షుడు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. రాయికల్ మండలం బోర్నపల్లిలో రూ.20 లక్షలతో చేపడుతున్న హెల్త్ సబ్‌సెంటర్, ఇటిక్యాలలో రూ.9 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు, అల్లీపూర్‌లో రూ.20 లక్షలతో చేపడుతున్న పల్లె దవాఖానా పనులను బుధవారం పరిశీలించారు. సబ్ సెంటర్ పనులను నెలరోజుల్లోపు పూర్తి చేయాలని, బ్రిడ్జిపనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, డీఈ మిలింద్, తహసీల్దార్ ఖయ్యూం ఉన్నారు.

ఓటరు నమోదు పక్కాగా..

జగిత్యాల: జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు పక్కాగా నిర్వహిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. సందేహాలుంటే తెలపాలన్నారు. ఓటరు నమోదు నిరంతరమని, ఫాం–6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు జరుగుతుందన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

పదో తరగతి పరీక్షల్లో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, సిట్టింగ్ స్క్వాడ్స్‌తో సమీక్షించారు. ఈనెల 21 నుంచి నిర్వహించే పరీక్షలకు 67 సెంటర్లు ఏర్పాటు చేశామని, 11,855 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. డీఈవో రాము పాల్గొన్నారు.





మారుమోగిన నారసింహ నామస్మరణ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం నారసింహ నామస్మరణతో మారుమోగింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగనంలో పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెల్ల శ్రీనివాసాచార్యుల పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

‘పది’కి పకడ్బందీ ఏర్పాట్లు

- బుక్‌లెట్ విధానంలో పది పరీక్షలు
- జిల్లాలో 67 సెంటర్ల ఏర్పాటు
- 11,855 మంది విద్యార్థులు

జగిత్యాల: పదో తరగతి పరీక్షలకు ఈ ఏడాది అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఇప్పటికే విద్యార్థులకు అనేక సూచనలు, సలహాలు ఇచ్చి సంసిద్ధం చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించారు. నిమిషం నిబంధన లేనప్పటికీ విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకుంటే ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే వీలుంటుంది. ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్న ఉద్దేశంతో కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని ఫోన్‌ఇన్, ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేస్తూ విద్యార్థుల సందేహాలను తీర్చారు. జిల్లాలో మొత్తం 11,855 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, నలుగురు అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 22 మంది కస్టోడియన్స్, 827 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

వసతుల ఏర్పాటు

ఈ ఏడాది ఎండలు మండిపోతుండడంతో కేంద్రాల వద్ద తాగునీటి వసతి ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి గదిలో ఫ్యాన్, ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు సమయానికి కేంద్రానికి చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకుంటే విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే పరిస్థితి ఉండదు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి నో

పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు ఎలాంటి అనుమతి లేదు. సీఎస్ డీవో, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. ఈ నిబంధన ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు ఉంటుంది.

బుక్‌లెట్ విధానంలో పరీక్షలు

ఈసారి జవాబులు రాసేందుకు విద్యార్థులకు బుక్‌లెట్ ఇస్తారు. ఇందులో మొత్తం 24 పేజీలుంటాయి. బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. అలాగే ప్రతి ప్రశ్నపత్రంపై ఈసారి క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఎక్కడ లీకేజీ అయినా సంబంధిత చోట లీకేజీ అయినట్లు తెలిసే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని అధికారులు పేర్కొంటున్నారు. హాల్‌టికెట్ పొందని వారు వెబ్‌సైట్ ద్వారా సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రశాంతంగా రాయాలి

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి. ప్రతి సెంటర్‌లో వసతులు ఏర్పాటు చేశాం. ఎలక్ట్రానిక్ వస్తువులు లోనికి తీసుకెళ్లకూడదు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఆలోచించి నిదానంగా పరీక్ష రాస్తే అత్యధిక మార్కులు సాధించవచ్చు.

– రాము, డీఈవో

పరీక్ష కేంద్రాలకు వెళ్లేదెలా..?

- గ్రామీణ ప్రాంతాలకు చేరని ఆర్టీసీ సేవలు
- పరీక్షల వేళ బస్సు సౌకర్యం కల్పించాలంటున్న విద్యార్థులు
- మండలంలో 510 మంది పదోతరగతి విద్యార్థులు

కథలాపూర్: ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. అయితే గ్రామీణప్రాంతాల నుంచి పరీక్షకేంద్రాలకు వెళ్లడమే పరీక్షగా మారిందని మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు వాపోతున్నారు. ఈ ఏడాది మండలంలో 510 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్నాయి. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్, జెడ్పీ హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. ఈ కేంద్రాల్లో కథలాపూర్, సిరికొండ, చింతకుంట, భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. చింతకుంట నుంచి కథలాపూర్‌కు సుమారు 6 కిలోమీటర్ల దూరం ఉండగా.. ఉదయం 7 గంటలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలంటే ఉదయం 8:30 గంటలకు చింతకుంట నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తే అదే రూట్‌లో ఉన్న భూషణరావుపేట, పెగ్గెర్ల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. పరీక్ష ఉదయమే కావడంతో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉండవని తల్లిదండ్రులు అంటున్నారు. మరోవైపు తక్కళ్లపెల్లి, బొమ్మెన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న బీమారం మండలం మన్నెగూడెం జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఇవన్నీ మారుమూల గ్రామాలు కావడంతో ఆ రూట్‌లో బస్సు సౌకర్యమే లేదు. పరీక్షల వేళ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. పోతారం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఈ రూట్‌లో బస్సు సౌకర్యం లేదు. ప్రత్యేకంగా ఉదయం 8:30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. లేకపోతే పరీక్ష సమయానికి చేరుకోవడం కష్టమేనని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి పదో తరగతి పరీక్ష సమయానికి ఉదయం, మధ్యాహ్నం బస్సుల సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

రాయికల్‌లో తెరపైకి తైబజార్

- రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- మున్సిపాలిటీకి ఏటా రూ.5లక్షల ఆదాయం
- చిరువ్యాపారులపైనే భారం



రాయికల్‌లో వారసంత



మున్సిపాలిటీ కార్యాలయం

రాయికల్: ఆదాయం లేక సతమతమవుతున్న రాయికల్ బల్దియాకు తైబజార్ ద్వారా ఏటా వచ్చే రూ.5లక్షలే ఎంతోకొంత ఉపయోగపడుతున్నాయి. రాయికల్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారి ఐదున్నర ఏళ్లు గడుస్తున్నప్పటికీ గత పాలకవర్గం ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు తైబజార్‌కు టెండర్ వేస్తూ రూ.5లక్షల ఆదాయం సమకూర్చుకుంది. బల్దియాకు ఉన్న ఏకైక తైబజార్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. రైతులు తాము పండించిన కూరగాయలను పట్టణానికి తీసుకొచ్చి స్థానిక పాతబస్టాండ్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డుకిరువైపులా పెట్టుకుని విక్రయిస్తారు. ప్రతి శనివారం ఇక్కడ వారసంత కూడా నిర్వహిస్తారు. ఇందులో రైతులు కూరగాయలు, నిత్యావసర సరుకులు తెచ్చి విక్రయిస్తారు. రూ.ఐదు లక్షలకు తైబజార్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వీరి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.10 మొదలు రూ.50 వరకు వసూలు చేస్తుంటారు.

తైబజార్ రద్దుకు కాంగ్రెస్ పోరాటం..

జగిత్యాల మున్సిపాలిటీ మాదిరిగానే రాయికల్‌లోనూ తైబజార్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, తాజామాజీ కౌన్సిలర్లు ఇటీవల ప్రజావాణికి వెళ్లి ఫిర్యాదు చేశారు. తైబజార్‌తో రైతుకూలీలు, తోపుడుబండ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే తైబజార్‌ను రద్దు చేసి చిరు వ్యాపారుల్లో ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. మరోవైపు తైబజార్ రద్దయితే ఆర్థికంగా నష్టపోతామని మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. ఏదేమైనా త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ తైబజార్ సమస్య బల్దియాలో మరోసారి తెరపైకి వచ్చింది. దీనిపై కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, అడిషనల్ కలెక్టర్ లత ఎలా స్పందిస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



రాయికల్‌లో తైబజార్ రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. టెండర్ నిర్వహణపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుంది.

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్



అంగరంగ వైభవంగా రథోత్సవం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శివారు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, టీవీ.సత్తన్న, టీవీ.సూర్యం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక, నాయకులు ఆనందరావు, మహేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు ఆస్పత్రుల వైద్యులపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని విద్యానగర్‌లోగల ఓ ఆస్పత్రి, కృష్ణానగర్‌లోని మరో ఆస్పత్రి వైద్యులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న శీలంపల్లి శ్రీనివాస్ ఈనెల 12న అతని భార్య అరుణను విద్యానగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యురాలు అరుణరెడ్డి సూచన మేరకు ఈనెల 13న శస్త్రచికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆపరేషన్ పూర్తి చేశామని అరుణను బయటకు తీసుకొచ్చారు. అపస్మారక స్థితి నుంచి ఎంతకీ తేరుకోకపోవడంతో శ్రీనివాస్ వైద్యురాలిని ప్రశ్నించాడు. దీనికి వైద్యులు కొంత ఇబ్బంది ఉందంటూ కృష్ణానగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అరుణ మంగళవారం ఉదయం మృతిచెందింది. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెండు ఆస్పత్రులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

వర్క్‌ఫ్రంహోం పేరిట మోసం

- రూ.7.65 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని భాగ్యనగర్‌కు చెందిన గాదె ప్రవీణ్‌కుమార్‌ను సైబర్ నేరగాళ్లు వర్క్‌ఫ్రం హోం పేరుతో మోసం చేశారు. ప్రవీణ్‌కుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జనవరి 30న టెలిగ్రామ్ అల్ఫా క్వాటిఫిక్స్ వీఐపీ ఛానల్‌లో జాబ్ వచ్చిందని, అందులో గూగుల్‌మ్యాప్, టాక్ రివ్యూ స్క్రీన్‌షార్ట్ పంపిస్తే ఒక్కోదానికి రూ.100 క్రెడిట్ చేస్తామని నమ్మించారు. అలా నమ్మి పలు దఫాలుగా లింక్‌లో టాస్క్ కంప్లీట్ చేసే విధానంలో పలు దఫాలుగా బ్యాంక్ నుంచి ఫోన్‌పే కింద ఆర్టీజీఎస్ ద్వారా మొత్తం రూ.7.65 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతోపాటు సైబర్ నేరగాళ్లు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయానని తెలుసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకుని వలస కార్మికుడు మృతి

మెట్‌పల్లిరూరల్: చెట్టుకు ఉరేసుకుని ఓ వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో జరిగింది. ఒడిశాలోని బాలనగిర్ జిల్లా గడియాజర్ మహకాండ తాలుకా గుటియపాడ గ్రామానికి చెందిన దమరుహన్సా (30) చౌలమద్ది శివారులోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వరకు తోటి కార్మికులతో కలిసి ఉన్న దమరుహన్సా సాయంత్రం చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

పెగడపల్లిలో విద్యార్థి కిడ్నాప్ కలకలం

- గంటలోనే చేధించిన పోలీసులు
- ఊపిరి పీల్చుకున్న బాలుడి తల్లిదండ్రులు



కిడ్నాప్‌నకు గురైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై రవికిరణ్

పెగడపల్లి: పెగడపల్లి మండలకేంద్రంలో బుధవారం పట్టపగలు విద్యార్థి కిడ్నాప్ కలకలం సృష్టించింది. గంట వ్యవధిలోనే పోలీసులు కిడ్నాప్‌ను చేధించడంతో విద్యార్థి తల్లిదండ్రులు, నందగిరి గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని నందగిరికి చెందిన రంజిత్‌కుమార్ మండలకేంద్రంలోని మోడల్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం తన స్నేహితుడు శివరాత్రి శివతో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వంతెన వద్ద కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు వారు పయణిస్తున్న ద్విచక్రవాహనాన్ని అడ్డగించి రంజిత్‌కుమార్‌ను కారులో ఎక్కించుకుని కరీంనగర్ వైపు తీసుకెళ్లారు. వెంటనే తేరుకున్న శివ ఫోన్‌ద్వారా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఎస్సై రవికిరణ్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్ వెంబడించి కారుతోపాటు కిడ్నాపర్లను పట్టుకున్నారు. కరీంనగర్ శివారు గ్రామమైన తీగలగుట్టపల్లికి చెందిన ఆరెపల్లి అనిల్, నవీన్‌కుమార్, గసికంటి వర్ధన్, మైస అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నవీన్‌కుమార్‌కు చెందిన పెంపుడు కుక్కను అపహరించాడన్న అనుమానంతో రంజిత్‌కుమార్‌ను కిడ్నాప్ చేసినట్లు నిందితులు తెలిపారు. రంజిత్‌కుమార్ తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. రంజిత్‌కుమార్‌ను పోలీసులు తల్లిదండ్రులకు సురక్షింతంగా అప్పగించారు. గంట వ్యవధిలో కిడ్నాప్ చేధించి బాలుడిని రక్షించిన ఎస్సై రవికిరణ్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, మండల ప్రజలు అభినందించారు.

పంపుహౌస్ వద్ద రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

- నీటి నిల్వలు పెంచాకే పంపింగ్ చేయాలని డిమాండ్

ధర్మారం(ధర్మపురి): నంది మేడారం రిజర్వాయర్ నుంచి ఎల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించటాన్ని నిరసిస్తూ మేడారం ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ మిట్ట తిరుపతి వారికి మద్దతు ప్రకటించారు. ఏఈఈ అఖిల్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అయినా, రైతులు వినలేదు. మేడారం రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గకుండా.. పూర్తిస్థాయి సామర్థ్యంలో నీటిని నింపిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. పరిస్థితిని ఏఈఈ అఖిల్ డీఈ బుచ్చిబాబుతో మాట్లాడి వివరించగా మరో మోటార్‌ను ఆన్‌చేస్తామని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించారు.

రథోత్సవానికి తీసుకెళ్లలేదని ఆత్మహత్య

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవానికి తీసుకెళ్లడం ఆలస్యమవుతుందని తండ్రి చెప్పినందుకు క్షణికావేశంలో యువతి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని దమ్మన్నపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోడేటి రాజమల్లు, మంజుల దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద కూతురు మహేశ్వరి (19) ఇంటర్ చదివి ఇంటి వద్దనే ఉంటుంది. నృసింహుని జాతరకు తీసుకెళ్లాలని తండ్రి కోరగా.. తాళ్లు ఎక్కివచ్చి తీసుకెళ్తానని చెప్పాడు. దీనికి మహేశ్వరి మొండికేసింది. తండ్రి తాళ్లు ఎక్కడానికి వెళ్లగా ఇంట్లోనే ఉరేసుకుంది. తల్లి మంజుల ఎంత బతిమిలాడినా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్క వాళ్లను పిలిచి తలుపులు పగులగొట్టింది. అప్పటికే మహేశ్వరి మృతి చెందింది. ఏఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మహేశ్వరి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

మానకొండూర్: మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాండ్ర దేవయ్య(54) బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాండ్ర దేవయ్య వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటిపై ఉన్న పరదా తీయడానికి పైకి ఎక్కాడు. పరదా తీస్తుండగా, ఇనుప చువ్వల ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలిస్తుండగా చనిపోయాడు.

కోరుట్ల పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తాం

- అమృత్ 0.2 నిధులు రూ.41 కోట్లు వెచ్చిస్తాం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



కోరుట్లలో తాళ్ల చెరువును పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: పట్టణ ప్రజల దాహార్తిని శాశ్వతంగా తొలగిస్తామని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ ఎస్సారెస్పీ కెనాల్, తాళ్ల చెరువు, ఫిల్టర్‌బెడ్‌ను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మాజీమంత్రి, స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు ముందుచూపుతో ఫిల్టర్‌బెడ్ నిర్మించారని, దానిని గత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో తాగునీటి కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువ నుంచి తాళ్లచెరువుకు నీరు వదిలేలా చూస్తామన్నారు. చెరువు ఆక్రమణలు తొలగించి గంగపుత్రులకు న్యాయం చేస్తామన్నారు. కొత్తగా అమృత్ 0.2 నిధులు రూ.41.50 కోట్లతో ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేస్తామన్నారు. చెరువుల్లో పూడికతీసి నీటి నిల్వ పెంచుతామని వెల్లడించారు. మున్సిపాల్టీలోని 33వార్డులకు 33 బోర్లు మంజూరు చేయించామన్నారు. అమృత్ 0.2 పథకం కింద రైతుల భూములకు నష్టం జరిగితే పరిహారం అందిస్తామని ఆర్డీవో జీవాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, జిందం లక్ష్మీనారాయణ, సంగ లింగం, నయీమ్, సత్యనారాయణ, మచ్చ కవిత, పుప్పాల ప్రభాకర్, శీలం వేణుగోపాల్, సోగ్రాబీ, మ్యాకల నర్సయ్య, రియాజ్‌లు పాల్గొన్నారు.

కోరుట్లకు క్రికెట్ మైదానానికి రూ.3 కోట్లు మంజూరు..

కోరుట్ల యువత కోరిక మేరకు క్రికెట్ మైదానం ఏర్పాటుకు రూ.3 కోట్లను శాప్ చైర్మన్ మంజూరు ఇచ్చారని, త్వరలో స్థల పరిశీలన చేసి పనులు చేపడతామని నర్సింగరావు అన్నారు. ఇటీవల నిర్వహించిన రత్నాకర్‌రావు మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నీతో పట్టణంలో క్రికెట్‌కు ఉన్న అభిమానం వెలుగులోకి వచ్చిందన్నారు. ఆ సమయంలోనే ఇక్కడి యువతకు ప్రత్యేక మైదానం కావాలని కోరగా.. ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి సూచించామని, ఆ మేరకు స్థల పరిశీలన చేస్తున్నామని వివరించారు.

కలెక్టరేట్ ఎదుట 'ఆశ'ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో ఆశాకార్యకర్తలు

జగిత్యాలటౌన్: ఉద్యోగ భద్రత, ఫిక్స్‌డ్ వేతనం, పదోన్నతి, పీఎఫ్, ఈఎస్‌ఐ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశకార్యకర్తలు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ఇందూరి సులోచన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ఆశాలకు ఏఎన్‌ఎంగా పదోన్నతి కల్పించాలని కోరారు. ఏఎన్సీ, పీఎన్సీ టార్గెట్లు రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరు లత, జిల్లా కార్యదర్శి మెట్టు మమత, సభ్యులు రాయికంటి దివ్య, బత్తిని వసంత పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల వేతన బకాయిలు విడుదల చేయాలని సులోచన డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నాలు, నిరసనలు, దీక్షలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు.

ప్రమాదంలో తండ్రి మృతి.. పరీక్ష రాసిన తనయుడు

సైదాపూర్: అల్లారుముద్దుగా పెంచిన తండ్రి శవం ఇంటి వద్ద ఉండగా.. ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు తనయుడు ఇంటర్ పరీక్షకు హాజరయ్యాడు. సైదాపూర్ మండలం ఆరెపల్లికి చెందిన బూర్గుల రాజేశ్వర్‌రావు కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత నెల 24న సాయంత్రం డ్యూటీ కోసం వెళ్తుండగా బైక్ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ సీఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. బుధవారం మృతిచెందాడు. తండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉండగా.. తనయు డు అంజి ఇంటర్ ఫస్టియర్ చివరి పరీక్ష కు హాజరయ్యాడు.

చోరీలకు ఈ-భద్రతతో చెక్

- అందుబాటులో అధునాతన పరికరాలు
- ఎక్కడున్నా అప్రమత్తం చేసే అవకాశం

గొల్లపల్లి: జిల్లాలో ఎక్కడోచోట చోరీ జరిగిందని వినబడుతూనే ఉంటుంది. అందమైన ఇళ్లు నిర్మించుకున్నా ఇంటిభద్రతకు చిన్నచిన్న తాళాలపైనే ఆధారపడుతున్నాం. తద్వారా దుండగులకు చోరీ చేయడం సులువు అవుతోంది. ఇలాంటి ఘటనలను సాంకేతికతతో నివారించ వచ్చని పోలీసులు సూచిస్తున్నారు. ప్రజలకు అవగాహన కూడా కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మార్కెట్‌లో ఇంటి భద్రతకు సంబంధించిన వస్తువులు అందుబాటులో ఉన్నాయి. సీసీ కెమెరాలు, అప్రమత్తం చేసే అలారాలు వైర్లను కత్తిరిస్తే తెలిపే ట్యాంపర్ ప్రూఫ్, వీడియోడోర్ ఫోన్, అలారం లాక్‌డిటెక్టర్.. ఇలా అనేక ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నామని, కళాబృందాలు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాయని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాలనీలవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దీంతో కాలనీలోకి కొత్తవారు వస్తే వారిని గుర్తించే అవకాశం ఉంటుంది. అపరిచిత వ్యక్తులు కనబడితే కాలనీవాసులు వివరాలు సేకరించాలి. రాత్రివేళలో షాపులవద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడం ద్వారా దొంగతనాలు నివారించే అవకాశం ఉంటుంది.

వీడియోడోర్ ఫోన్

ఇది ఇంటికొచ్చి డోర్‌ముందు ఉన్న వారిని లోపలి నుంచే గుర్తిస్తుంది. మొత్తంగా కాలింగ్ బెల్‌లాగా పనిచేస్తుంది. వైర్స్, బ్యాటరీతో పనిచేసే ఈ పద్ధతికి రెండు పరికరాలు ఉంటాయి. కాలింగ్ బెల్‌బటన్, స్పీకర్ ఉన్న యూనిట్‌ను ఇంటి బయట బిగిస్తారు. స్క్రీన్‌తో కూడిన పరికరాన్ని ఇంటి లోపల పెడుతారు. ఇంటికి వచ్చింది అపరిచిత వ్యక్తులా.. లేక తెలిసిన వారా..? అని గుర్తించిన తరువాత తలుపు తీసేందుకు ఈ పరికరం తోడ్పడుతుంది. దీని ధర రూ.5వేల నుంచి మొదలవుతుంది.

సెంట్రల్ లాక్ సిస్టం

ఇంటి తలుపులకు సెంట్రల్‌లాక్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. ఈ లాక్ డోర్ లోపల అమర్చితే కనబడకుండా ఉంటుంది. దీనిపై నుంచి గొళ్లెంను ఏర్పాటు చేసుకుని తాళం వేసుకుంటారు. తాళం పగులగొట్టిన సెంట్రల్ లాక్ సిస్టం ద్వారా డోర్ తెర్చుకోలేదు. దీంతో దుండగులు తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించే వీలుండదు.

అప్రమత్తం చేసే అలారం

పండుగలు, సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో డోర్‌కు తాళం వేసి వెళ్తుంటాం. ఈ సమయంలో దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తే పెద్ద శబ్దంతో ఇంటి యజమానితోపాటు పోలీసులకు సమాచారం వెళ్తుంది. ఇంటికి కంట్రోల్ ప్యానల్ పరికరాన్ని ఏర్పాటు చేసి, దీనికి అనుసంధానంగా తలుపులు, కిటికీలకు సెన్సార్లను ఏర్పాటు చేస్తారు. ఇంటికి తాళం వేసి వెళ్లాక ఎవరైనా తలుపులు, కిటికీలను విరగగొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేస్తే పెద్ద శబ్దాలు రావడంతోపాటు ఇంటి యజమాని ఫోన్, పోలీసులకు సమాచారం వెళ్లేలా సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు. కమ్యూనికేటర్ పరకరంతోనే ఇదంతా జరుగుతుంది. వీటి ధర రూ.1500 నుంచి రూ.10 వేల వరకు ఉంది.

వాహనాలకు జీపీఎస్

వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసే వాహనం చోరీకి గురైన సమయంలో ఎటువైపు వెళ్లిందో ఇందులో స్పష్టంగా కనబడుతుంది. వాహనాన్ని పోలీసుల సహాయంతో తిరిగి పొందే అవకాశం ఉంటుంది. జీపీఎస్ నెట్‌వర్క్‌పై ఆధారపడి ఉంటుంది. ట్రాకింగ్ కిట్‌ను కమ్యూనికేటర్ పరికరంతో వాహనానికి ఏర్పాటు చేస్తారు. ఇది బయటకు కనిపించకుండా ఇంజిన్ వద్ద దీనిని బిగిస్తారు. ఈ జీపీఎస్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను వాహనదారుడి ఫోన్‌కు అనుసంధానం చేస్తారు. ఇంటర్‌నెట్ సహాయంతో వాహనం ఏ ప్రాంతంలో ఉన్నది..? ఎక్కడికి వెళ్తుందో..? ఎంత స్పీడ్‌లో వెళ్తుందో..? అనేది ఫోన్‌లో లేదా కంప్యూటర్‌లో చూసే అవకాశం ఉంటుంది.

విద్యుత్ చార్జీల పెంపు లేదు

- 2025–26కు టారీఫ్ పెంపుదల ప్రతిపాదించలేదు
- ప్రస్తుత ధరల్లో ఎటువంటి మార్పూ లేదు
- గ్రీన్ ఎనర్జీ వినియోగించుకుంటే యూనిట్‌కు 0.66 గ్రీన్ టారీఫ్
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై స్పష్టత వచ్చింది. బుధవారం హనుమకొండలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన రిటైల్ సప్లయి వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవారాజు నాగార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ విచారణలో విద్యుత్ టారీఫ్‌ల ప్రతిపాదనలపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదన్నారు. ప్రస్తుతమున్న ధరల్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులక సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ. 0.66 గ్రీన్ టారీఫ్ విధింపు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసి ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్లు వినియోగించుకున్న వినియోగదారులకు ఎనర్జీ చార్జీల్లో 10 శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపును కొనసాగిస్తున్నామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ నిర్వహణకు 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.19,814 కోట్ల ఆదాయ ఆవశ్యకత ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత టారిఫ్ (టారిఫేతర ఆదాయం కలుపుకుని) రూ.9,421కోట్ల వస్తుందని అంచనా. దీంతో రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుంది.

సర్కారు ఆస్పత్రి భవనం కూల్చివేత

- పనులు ప్రారంభించిన సిబ్బంది
- విభాగాలన్నీ ఎంసీహెచ్‌లోకి తరలింపు
- రూ.51 కోట్లతో కొత్తభవన నిర్మాణం



కిటికీలు, ఇతర సామగ్రి తొలగిస్తున్న కూలీలు

పెద్దపల్లిరూరల్‌: జిల్లా కేంద్రంలోని జనరల్‌ ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం కూల్చివేసి ఆ స్థలంలో రూ.57కోట్ల వ్యయంతో ఆధునిక వసతులతో కూడిన కొత్త భవనం నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేయడంతో కూల్చివేత పనులు బుధవారం ప్రారంభించారు. పాత భవనంలోని అన్ని విభాగాలను మాతాశిశు ఆస్పత్రిలోకి తరలించారు.

కూల్చివేత షురూ..

ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించేందుకు రూ.51 కోట్లు కేటాయించారు. ఈ నిధులు వెచ్చించి పనులు ప్రారంభించేందుకు వీలుగా పాత భవనం కూల్చివేస్తున్నారు. ఇప్పటికే కిటికీలు, తలుపులు, పార్టిషన్ల తొలగింపు పూర్తి కావొచ్చింది. సామగ్రి తొలగింపు పూర్తయ్యాక యంత్రాలతో భవనాన్ని నేలమట్టం చేసేలా కార్యాచరణ చేపట్టామని అధికారవర్గాలు తెలిపాయి.

డయాలసిస్‌ కేంద్రం తరలింపు

పాత భవనంలోని డయాలసిస్‌ కేంద్రం తరలింపు గందరగోళంగా ఉంది. ఐదు పడకలున్న డయాలసిస్‌ సెంటర్‌లో మూడుషిఫ్టుల్లో 15 మందికి సేవలందిస్తున్నారు. దీనిని కూడా మాతాశిశు ఆస్పత్రిలోని మొదటిఅంతస్తుకు మార్చాలని నిర్ణయించారు. డయాలసిస్‌ పేషంట్లు తాము మెట్లు ఎక్కి, దిగలేమని, కింది ఆవరణలోనే ఉండేలా చూడాలని అధికారులను కోరారు. ఈ వ్యవహారం వైద్యశాఖ ఉన్నతాధికారుల దాకా వెళ్లినట్లు సమాచారం. డయాలసిస్‌ సెంటర్‌ నిర్వహణకు అవసరమైన స్థలం కింద అందుబాటులో లేదని వైద్యాధికారులు కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సెకండ్‌ ఫ్లోర్‌లో డయాలసిస్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు.

మూడంతస్తుల్లో భవనం



ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి మూడంతస్తులతో కూడిన కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పాతభవనం కూల్చే పనులు మొదలయ్యాయి. డయాలసిస్‌ సెంటర్‌ను మాతా శిశు ఆస్పత్రిలోని సెకండ్‌ఫ్లోర్‌కు తరలిస్తున్నాం. డయాలసిస్‌ కోసం వచ్చే 15 మంది పేషెంట్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, సూపరింటెండెంట్‌

క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న డీసీపీ కరుణాకర్‌

ఓదెల(పెద్దపల్లి): క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి ఉన్నతశిఖరాలు అధిరోహించాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్‌ సూచించారు. కనగర్తి, ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ, ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులవుతారన్నారు. సమాజంలో గౌరవంగా బతికేందుకు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలని అన్నారు. ఏసీపీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సుల్తానాబాద్‌ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై రమేశ్, ఏఎస్సై సుధాకర్, ఎంఈవో రమేశ్, సైకాలజిస్ట్‌ అనిత పాల్గొన్నారు.

ఢిల్లీలో గళమెత్తిన ఎల్‌ఐసీ ఏజెంట్లు



ఢిల్లీ మహాధర్నాలో రామగుండం ఏజెంట్లు

కోల్‌సిటీ(రామగుండం): ఎల్‌ఐసీ పాలసీదారుల పాలసీలపై బోనసు పెంచడంతోపాటు పాలసీలపై రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ గురువారం ఢిల్లీలో జరిగిన శాంతియుత మహాధర్నాలో పెద్దపల్లి జిల్లా రామగుండం ఎల్‌ఐసీ బ్రాంచ్‌ నుంచి 100 మంది ఏజెంట్లు పాల్గొని గళమెత్తారు. కేంద్రప్రభుత్వం ఐఆర్‌డీఏఐ, జీవిత బీమా మొండివైఖరికి నిరసనగా, ఆల్‌ ఇండియా ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సుమారు 2లక్షల మంది ఏజెంట్లతో శాంతియుత మహాధర్నా జరిగింది. సుమారు 100 మంది రామగుండం ఏజెంట్లు స్వచ్ఛందంగా ఢిల్లీ తరలివెళ్లి నిరసనలో పాల్గొన్నారు. పాలసీదారులకు పాలసీలపై బోనసు పెంచాలని, జీఎస్టీ రద్దు చేయాలని, మినిమం సమ్‌ అస్సూర్డ్‌ అందరికీ అందుబాటులో ఉండాలని, క్లా బ్యాక్‌ విధానానికి వ్యతిరేకంతోపాటు ఏజెంట్ల భవిష్యత్‌ రక్షణ తదితర ముఖ్యమైన డిమాండ్లను పరిష్కరించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఆల్‌ ఇండియా ఏజెంట్ల సమాఖ్య అధ్యక్షుడు శ్యామల్‌ చక్రవర్తి, లియాఫీ జనరల్‌ సెక్రటరీ శ్రీనివాసచారి డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం లియాఫీ అధ్యక్ష, కార్యదర్శులు గుడికందుల రవి, కటకం సతీశ్‌తోపాటు ఏజెంట్లు అంబాల బాబు, జనగామ సదయ్య, చింతల శ్రీనివాస్, బూర్ల దామోదర్, అచ్చ వేణు, శనిగరపు రమేశ్, రవి, రమేశ్, రుషేంద్రం, బుచ్చిరాజం, పోతుల నగేశ్, ఇ.కనకయ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజన్న రథోత్సవం



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శివకల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. సుందరంగా అలంకరించిన పెద్దసేవలపై ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ అర్చకులతో కలిసి పెద్దసేవలను మోశారు. శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు దారిపొడవునా నృత్యాలు చేశారు. ప్రధాన ఆలయం నుంచి శ్రీవేణుగోపాలస్వామి గుడి వద్దకు వచ్చి తిరిగి ప్రధానాలయానికి చేరుకుంది. ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి పేరుతో రుణాలు

- ఒకరు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాశ్‌



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చోళ మండల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ అండ్‌ ఫైనాన్స్‌ కంపని లిమిటెడ్‌ అండ్‌ హౌసింగ్‌ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు చనిపోయిన వారి పేరుతో సుమారు రూ.కోటి 39 లక్షల 90 వేల రుణం తీసుకుని మోసానికి పాల్పడ్డారని ఏసీపీ ప్రకాశ్‌ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కంపనీ హెడ్‌ ఆఫీస్‌ జోనల్‌ లీగల్‌ మేనేజర్‌ పీ.గగన్‌దీప్‌ అగర్వాల్‌ గత జనవరి 9న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరిపించగా అందులో పని చేసే సిబ్బందే మోసాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. మంచిర్యాల బ్రాంచ్‌ మేనేజర్‌ చల్ల ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్‌ ఏరియాలో ఏసీఎంగా పని చేసిన చిట్టేటి అశోక్‌రెడ్డి పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడ్డారన్నారు. కాగా బుధవారం ప్రవీణ్‌రెడ్డిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని, అశోక్‌రెడ్డి పరారీలో ఉన్నాడన్నారు. చెన్నూర్‌ మండలం కత్తెరశాల, కిష్టపేట గ్రామాలకు చెందిన మృతులు చేతెల్లి సమ్మయ్య పేరుతో రూ.25.90 లక్షలు, చల్ల రామయ్య పేరుతో రూ.20 లక్షలు, చేతెల్లి చిన్న బక్కయ్య పేరుతో రూ.20 లక్షలు, దోమల సారమ్మ పేరుతో రూ.24 లక్షలు, చల్ల రవీందర్‌ పేరుతో రూ.25 లక్షలు, బొజ్జ మల్లయ్య పేరుతో రూ.25 లక్షలు తీసుకుని సొంతానికి వాడుకున్నారన్నారు. ఈ కేసులో ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డికి మరి కొంతమంది సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలో వారిని సైతం అరెస్ట్‌ చేస్తామన్నారు.

సైబర్‌ నేరగాళ్ల బురిడీ..

- ఖాతాలోంచి రూ.56వేలు మాయం



రామకృష్ణాపూర్‌: టికెట్‌ క్యాన్సిల్‌ ఎలా చేయాలని కస్టమర్‌ కేర్‌ నంబర్‌ కోసం గూగుల్‌లో వెతకడమే అతను చేసిన తప్పు. ఓ లింక్‌ పంపిస్తామని దాని ద్వారా యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకోవాలని అవతలి వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి యాప్‌ డౌన్‌లోడ్‌ చేశాడు. ఇంకేముంది అకౌంట్‌లో నుంచి రూ.56వేలు పోగొట్టుకున్నాడు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌ పట్టణ ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఏజోన్‌ ఏరియాకు చెందిన సదానందం ఇటీవల తత్కాల్‌ ద్వారా బుక్‌ చేసిన రైల్వే టికెట్‌ను క్యాన్సిల్‌ ఎలా చేయాలని గూగుల్‌లో కస్టమర్‌ కేర్‌ నంబర్‌ కోసం వెతికాడు. అందులో లభించిన ఓ నంబర్‌కు ఫోన్‌ చేయడంతో అవతలి వ్యక్తి పలు సూచనలు చేశాడు. టికెట్‌ క్యాన్సిల్‌ కోసం తాము సహాయం చేస్తామని, ముందుగా తాము పంపిన లింక్‌ ద్వారా యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించాడు. అనంతరం ఫోన్‌పే యాప్‌ ఓపెన్‌ చేసి తన బ్యాంకు ఖాతా చూసుకోమని చెప్పగా అందులో నుండి రూ.56 వేలు మాయమయ్యాయి. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా సైబర్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు, ఆభరణాలు షాపుల్లో ఉంచొద్దు

- ఆదిలాబాద్‌ డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: షాపులు, మాల్స్‌లో భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు నిల్వ ఉంచవద్దని ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దొంగలు టెక్నాలజీని వాడి చోరీలకు పాల్పడుతున్నారని, షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు రోజుల క్రితం దస్నాపూర్‌లోని నేషనల్‌ మార్ట్‌లో జరిగిన చోరీకి కటింగ్‌ గ్రైండర్‌ ఉపయోగించి లాకర్‌ను పగులగొట్టారన్నారు. ఆ మార్ట్‌ పక్కన నిచ్చెన ఉండగా, దాని సహాయంతో పైకి ఎక్కి రేకులకు ఉన్న బోల్టులు తొలగించి షాపులోనికి చొరబడినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడే ముందు సీసీ కెమెరాలో ఫుటేజీ నమోదు కాగా దాని తర్వాత కనెక్షన్‌ తొలగించినట్లు పేర్కొన్నారు. దొంగను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టించిన వారికి నజరానా ఇస్తామన్నారు. షాపులు, మాల్స్‌లో లాకర్‌సేఫ్‌ అని నమ్మవద్దని, కటర్లతో వాటిని సైతం పగులగొడుతున్నారన్నారు. షాపుల ముందు హ్యూమెన్‌ అలర్ట్‌ డిటెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగదును షాపులో ఉంచకుండా ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేయాలన్నారు. టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగకు సంబంధించిన చిత్రాన్ని విడుదల చేశారు.

భర్త చేతిలో భార్య హతం



నిరోజ(ఫైల్‌)

ఖానాపూర్‌: భర్త చేతిలో భార్య హతమైన సంఘటన మంగళవారం రాత్రి నిర్మల్‌ జిల్లా పెంబి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఖానాపూర్‌ సీఐ సీహెచ్‌ అశోక్‌ తెలిపిన ప్రకారం.. ఖానాపూర్‌ మండలంలోని బావాపూర్‌(ఆర్‌) తండాకు చెందిన లావుడ్య అర్జున్‌కు గోసంపల్లె గ్రామానికి చెందిన నిరోజ(25)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించిన అర్జున్‌ భార్య నిరోజను కొట్టడంతో మృతిచెందింది. బుధవారం ఉదయం మృతి విషయం తెలిసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. ఘటన స్థలాన్ని నిర్మల్‌ ఏఎస్పీ రాజేశ్‌మీనన్‌ సందర్శించారు. ఆయన వెంట పెంబి ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

లక్ష్య సాధనలో దూసుకెళ్తున్న గనులు

- గడువుకు ముందే అధిగమించిన ఏడు గనులు



సింగరేణి ఓసీపీ

గోదావరిఖని: లక్ష్య సాధనలో సింగరేణి బొగ్గు గనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. ఉత్పత్తి సాధన కోసం అధికారులు, కార్మికులు సమష్టిగా శ్రమిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్‌ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం నిర్దేశించింది. ప్రస్తుతం 98 శాతం ఉత్పత్తితో ముందుకు సాగుతోంది. సింగరేణి డైరెక్టర్లు ఏరియాల వారీగా పర్యటిస్తూ ఉత్పత్తి లక్ష్య సాధనకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రతీవారం సీ అండ్‌ ఎండీ బలరాం వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షిస్తున్నారు.

21 భూగర్భ.. 18 ఓసీపీలు..

సింగరేణిలో 21 భూగర్భ గనులు, 18 ఓసీపీలుండగా, వీటిలో రెండు భూగర్భ గనులు, ఐదు ఓసీపీలు ఇప్పటికే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాయి. గడువుకు ముందే లక్ష్యం సాధించడంపై సీఅండ్‌ఎండీ అభినందించారు. వారిలో మరింత స్ఫూర్తి నింపేందుకు అన్నిగనులపై పర్యటించి మనోధైర్యాన్ని కల్పించారు. సంస్థ భవిష్యత్‌ కోసం ప్రతీఒక్కరు పనితీరు మెరుగుపర్చుకోవడంతో పాటు ఉత్పత్తి లక్ష్యం పెంచాలని, ఇదే సమయంలో రక్షణపై దృష్టి సారించాలని సూచించారు.

ఓసీపీలపైనే ప్రధాన దృష్టి..

ఓసీపీలపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. మొత్తం 70శాతం బొగ్గు ఉత్పత్తి ఓసీపీలపైనే ఆధారపడి ఉంది. ఈక్రమంలో సంస్థ సీఎండీతో పాటు డైరెక్టర్లు ఓసీపీల్లో ఓబీ వెలికితీత, బొగ్గు ఉత్పత్తి, తీసిన బొగ్గు రవాణా చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్రతీషిఫ్టు, రోజువారీ ఉత్పత్తి లక్ష్యం జాబితాను ఎప్పటికప్పుడు తెప్పించుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉత్పత్తి తగ్గినా, రవాణా ఆగినా వెంటనే ఉన్నతాధికారులు లైన్‌లోకి వచ్చి వివరణ అడుతున్నారు. ఈ మార్చితో వార్షిక లక్ష్యం గడువు ముగుస్తుంది. దీంతో అధికారులు, ఉద్యోగులు ప్రతీక్షణం అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగుతున్నారు.

లక్ష్యం సాధించిన రెండు భూగర్భగనులు

ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు భూగర్భ గనులు వార్షిక లక్ష్యం సాధించాయి. శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఆర్కే న్యూటెక్‌ 23 రోజుల ముందుగా, ఆర్కే–6గని 20రోజుల ముందుగా లక్ష్యం సాధించి అగ్రగామిగా నిలిచాయి. మిగతా గనులు కూడా లక్ష్యాల సాధనలో పోటీ పడుతున్నాయి.

ఐదు ఓసీలు కూడా..

ఐదు ఓసీపీలు వార్షిక లక్ష్యాన్ని నిర్దేశిత గడువుకు ముందుగానే సాధించాయి. కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసీ 23రోజుల ముందుగా, శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ–2 ఓసీ 24 రోజుల ముందుగా, 21 రోజుల ముందుగా మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–4, ఆర్జీ–3లోని ఓసీపీ–2.. 20రోజుల ముందుగా, ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ 16రోజుల ముందుగా లక్ష్యం పూర్తి చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నాయి.

నిర్దేశిత వార్షిక లక్ష్యం సాధించిన గనులు

ఏరియా	గని	లక్ష్యం సాధించిన తేదీ
శ్రీరాంపూర్‌	ఆర్కేనూటెక్‌(భూగర్భ గని)	మార్చి 03
శ్రీరాంపూర్‌	ఆర్కే–6(భూగర్భ గని)	మార్చి 11
కొత్తగూడెం	కిష్టారం ఓసీపీ	ఫిబ్రవరి 08
శ్రీరాంపూర్‌	శ్రీరాంపూర్‌ ఓసీ–2	మార్చి 07
మణుగూరు	పీకే ఓసీపీ–4	మార్చి 10
ఆర్జీ–3	ఓసీపీ–2	మార్చి 11
ఆర్జీ–1	జీడీకే–5 ఓసీ	మార్చి 15

ఇదే స్ఫూర్తితో ముందుకు..



వార్షిక లక్ష్యాన్ని సాధించిన గనులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా గనులు కూడా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలి. బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన రెండు భూగర్భగనులు, ఐదు ఓసీపీల ఉద్యోగులు, గని అధికారులను అభినందిస్తున్నా.

– బలరాం, సింగరేణి, సీఎండీ

బడ్జెట్‌ పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- భూభారతికి చట్టబద్ధత తేవాలి
- ఎస్సీ, బీసీ బిల్లుల ఆమోదం హర్షణీయం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ ప్రజారంజకంగా ఉందని, దానిని పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సిరిసిల్ల కార్మిక భవనంలో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఆశలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్నం భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలివ్వాలని కోరారు. అన్ని శాఖల్లోని చిరు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతులు తొలగించాలని కోరారు. ఎస్సీ, బీసీ బిల్లుల ఆమోదం హర్షణీయమన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు అందివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు బోయిన అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కుర్ర రాకేశ్‌ పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్‌

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌ మండలం తారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డిని సస్పెండ్‌ చేస్తూ వరంగల్‌ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శ్యాంసుందర్‌రెడ్డి చిట్టీల వ్యాపారంలో జమ్మికుంట మండలం పాపయ్యపల్లెకు చెందిన రాపెల్లి కుమారస్వామికి ఆయన డబ్బు ఇవ్వకుండా సతాయిస్తున్నారు. దీంతో గత జనవరి 20వ తేదీన జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా, చిట్టీల డబ్బు సమస్య తేలకపోవడంతో బాధితుడు అదేనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీకి సైతం ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం ఈనెల 12వ తేదీన తారుపెల్లి హెచ్‌ఎం శ్యాంసుందర్‌రెడ్డిని సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నీటి గోస తీర్చండి

- అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకున్న సుంగాపూర్‌ గ్రామస్తులు
- 'సాక్షి' కథనంతో కదిలిన యంత్రాంగం

సాక్షి స్పందన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్‌

నార్నూర్‌: 'నీళ్ల కోసం ఇంకెంత కాలం తిప్పలు పడాలే.. గొంతు తడువాలంటే బిందెలు పట్టుకుని కిలోమీటర్‌ దూరం వెళ్లాల్సి వస్తుంది.. ఎండ్లు గడుస్తున్నా మా గోస తీరట్లే.. ఈ సమస్యతో మా ఊరి పిలగాండ్లకు పిల్లను కూడా ఇస్తలేరు.. పశువులను కూడా వేరే చోటుకు తీసుకెళ్లాల్సి వస్తోంది..' అంటూ ఆ గ్రామానికి విచ్చేసిన అధికారుల ఎదుట ఆదివాసీలు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆదిలాబాద్‌ జిల్లా నార్నూర్‌ మండలంలోని సుంగాపూర్‌ గోండుగూడలో తాగునీటి ఇక్కట్లపై 'గుక్కెడు నీటికి అరిగోస' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు ఉదయాన్నే గ్రామానికి చేరుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈ శ్రీనివాస్, ఎంపీవో సాయిప్రసాద్‌ స్థానికులతో మాట్లాడి నీటి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఇబ్బందులను వివరించారు. ఉన్నతాధికారులు వచ్చి శాశ్వత పరిష్కారం చూపేంత వరకు వారిని కదలనీయబోమని అక్కడే కుర్చొని నిరసన తెలిపారు. విషయం కలెక్టర్‌ దృష్టిలో ఉందని, ప్రతి పాదనలు సైతం పంపామని, వారం రోజుల్లో ప్రత్యేక పైపులైన్‌ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని గ్రామస్తులకు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వాలని స్థానికులు పట్టుబట్టారు. ఈ మేరకు అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈతో సెల్‌ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన నచ్చజెప్పడంతో వారు శాంతించారు. విషయం తెలుసుకున్న సీఐ రహీం పాషా గోండుగూడను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. శాంతియుత మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో స్థానికులు మాడవి లచ్చు పటేల్, కనక తెలంగాణారావు, కొడప లింగు, పెందూర్‌ లక్ష్మణ్, భీంరావ్‌ తదితరులున్నారు.

ఆస్పత్రి భవనం ప్రారంభమెప్పుడో..!

- రూ.8.50 కోట్లతో నిర్మాణం
- టెండరు దశలోనే మార్చురీ గది



ప్రభుత్వాసుపత్రి పక్కా భవనం

లక్సెట్టిపేట(మంచిర్యాల): 2023 ఏప్రిల్‌లో రూ.8.50 కోట్ల నిధులతో మండల కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో చేపట్టిన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అప్పటి మంత్రి హరీష్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల ప్రజల కోసం 30 పడకలతో ఆస్పత్రి పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభిస్తామని అధికారులు నిర్ణయించినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆసుపత్రిని పాత ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. అరకొర సౌకర్యాలతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

టెండరు దశలోనే మార్చురీ గది నిర్మాణం

ఆస్పత్రిలో రెండంతస్తులతో 20 గదులు, ఓటీ, క్యాజువాలిటీ గది, మేల్, ఫీమేల్‌ వార్డులు, లేబర్‌ రూం, ఎక్స్‌రే, శానిటేషన్, అన్ని ఏర్పాట్లతో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం, పైప్‌లైన్‌ల పనులు పూర్తి చేశారు. కానీ మార్చురీ గది నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌ రావు ఇటీవల ఆసుపత్రిని పరిశీలించి అధికారులతో మాట్లాడి ఆరోగ్య శాఖ నుంచి రూ. కోటి 60 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈనెల 27 వరకు ఆన్‌లైన్‌ టెండరు ప్రక్రియ పూర్తి కానుంది. స్థల పరిశీలన జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ఇటీవల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

త్వరగా పూర్తి చేయాలి



ఆస్పత్రి భవనం పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. మిగతా పనులను అధికారులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. ప్రస్తుత ఆస్పత్రి భవనం రేకుల షెడ్డు కావడంతో ఇబ్బంది అవుతుంది. మార్చురీ లేకపోతే పోస్ట్‌మార్టం చేసేందుకు ఇబ్బంది అవుతుంది. అన్ని పనులు పూర్తి చేసి త్వరగా ప్రారంభించాలి.

– శ్రీనివాస్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట